సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 30 । జూలై । 2025



పేరుకే పైలెట్ ప్రాజెక్ట్

కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంతోనైనా సమస్యలు తీరుతాయని ఆశించిన రైతుల కలలు కల్లలయ్యాయి. 8లో▸



అసైన్డ్ భూములు విక్రయిస్తే..

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని మహేశ్వరం తహసీల్దార్ సైదులు హెచ్చరించారు. 8లో▸



గెలుపే లక్ష్యంగా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్ రేపు

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఈ నెల 31న ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని చేవెళ్ల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాలతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని తోలుకట్ట సమీపంలో ఉన్న చేవెళ్ల గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 2025లో 10వ తరగతి పాసైన విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్ తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో ఉదయం 9 నుంచి ఒంటి గంట లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మధ్యాహ్నం 2నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీలు పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపీసీలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థులకు సమాన మార్కులు ఉంటే గణితం, సైన్స్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా, బైపీసీలో అడ్మిషన్ తీసుకునే వారికి సమాన మార్కులు ఉంటే సైన్స్, గణితంలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం సమీపంలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల (సీఓఈ)లో ఇంటర్‌లో పరిమిత ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 31నస్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొందుర్గు గురుకుల కళాశాలలో..

కొందుర్గు: గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ కుర్షీద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై జూనియర్ కళాశాల ఎంపీసీ, బైపీసీలో చేరాలనే ఆసక్తి గల బాలురు ఈ నెల 31న ఉదయం 9 గంటల వరకు దరఖాస్తులు తీసుకొని కళాశాలలో హాజరుకావాలని సూచించారు. టీసీ, మెమో, బోనఫైడ్, కులం, ఆదాయం ఒర్జినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్‌లను తీసుకురావాలన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

కందుకూరు: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నూతన పీఆర్సీ, పెండింగ్ డీఏలను, నూతన ఆరోగ్య కార్డులను వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్షన్లను పరిగణలోకి తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ఏవీ సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి, ఏఐఎస్‌టీఎఫ్ ఉపాధ్యక్షుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సమాయత్తం అవుదాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల సమావేశం మంగళవారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అత్యధిక జెడ్పీటీసీలు, ఎంపీటీసీలను గెలిచి జిల్లా పరిషత్, మండల పరిషత్ పీఠాలను వసం చేసుకోవాలని అన్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, నాయకులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బుద్ధుడిపై నాటిక ప్రదర్శన

చేవెళ్ల: మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని పీవీ కన్వెన్షన్‌లో ఈనెల 31న ‘బుద్ధుడితో నా ప్రయాణం’ నాటికను ప్రదర్శిస్తున్నట్లు సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ బౌద్ నాగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాగపంచమి వైభవం



తుక్కుగూడ: రావిర్యాలలో..



మొయినాబాద్: పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న మహిళలు

నాగుల పంచమి సందర్భంగా మంగళవారం నాగదేవత ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద పాలు పోసి ఇంటిల్లిపాదిని చల్లగా చూడాలని మొక్కుకున్నారు.



కడ్తాల్: మైసిగండి ఆలయంలో..

సీత్లా సంబురం

సీత్లా సంబురాలు అంబరాన్నంటాయి. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో మంగళవారం గిరిజన మహిళలు భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని తలపై ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లారు. సీత్లా భవానికి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు సందర్భంగా డీజే హోరు మధ్య యువతీ యువకుల నృత్యాలు అలరించాయి.

– ఆమనగల్లు





‘రిజిస్ట్రీ’తోనే పథకాలు

- ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ
- రైతులంతా నమోదు చేసుకోవాలంటున్న అధికారులు



కందుకూరు రైతు వేదిక వద్ద రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ (ఫైల్)

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధిపొందడానికి తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాల్సిందే. ఈ మేరకు ఆన్‌లైన్‌లో వ్యవసాయాధికారులు నమోదు చేపట్టారు. పీఎం కిసాన్ పథకం, సబ్సిడీపై ఫర్టిలైజర్, యంత్ర పరికరాల సరఫరా తదితర క్రేందం అమలు చేయనున్న ప్రయోజనాలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ నమోదు ప్రక్రియ రాష్ట్రంలో మూడు నెలలుగా జరుగుతుండగా జిల్లాలో నెలన్నర నుంచి కొనసాగుతోంది.

పట్టాదారు పాస్‌పుస్తం, ఆధార్‌కార్డుతో..

గత డిసెంబర్ 31లోపు భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల వివరాలు మాత్రమే ప్రస్తుతం అధికారుల వద్ద ఉన్నాయి. వాటికే ఆన్‌లైన్‌లో నమోదు జరగనుంది. రైతులు ఏఈఓల వద్దకు తమ పట్టాదారు పాస్‌పుస్తం, ఆధార్‌తో లింకైన సెల్‌ఫోన్, ఆధార్‌కార్డుతో వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలి. ఫోన్ నంబర్‌కు మూడు సార్లు ఓటీపీలు వస్తాయి. వాటిని చెబితే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూములు ఉన్నా సరే ఎక్కడైనా ఒక దగ్గర ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుంటే సరిపోతుంది. హైదరాబాద్‌లోని అడ్రస్ ఉన్న ఆధార్ అయినా సరే రిజిస్ట్రీ చేయించుకోవచ్చు. రైతులు సత్వరమే ఏఈఓల వద్దకు వెళ్లి రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పథకాలు పొందాలంటే..



కేంద్ర సంక్షేమ పథకాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇప్పటి వరకు మండలంలో 7,800 మంది రైతులు వివరాలు నమోదు చేయించుకున్నారు. చేయించుకోని రైతులు త్వరగా నమోదు చేయించుకోవాలి.

– లావణ్య, ఏఓ, కందుకూరు

మిగులు భూములు పేదలకు పంచాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండలంలోని కప్పపహాడ్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఓ భూస్వామి చేతిలో ఉన్న 98 ఎకరాల సీలింగ్ భూమిని స్వాధీనం చేసుకున్నారు. 35 ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించాలని కోరుతూ మంగళవారం కదంతొక్కారు. పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యతో కలిసి ట్రాక్టర్‌తో దుక్కిదున్ని, విత్తనాలు వేశారు. పొలం మొత్తం ఎర్రజెండాలు పాతారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భూ చట్టాలను అతిక్రమించి వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. కప్పపహాడ్‌లో ఓ భూస్వామి 98 ఎకరాలు కాజేయాలని చూశారన్నారు. కలెక్టర్, కోర్టులు ఆ భూమిని సీలింగ్‌గా ప్రకటించారని, ఈ భూమిని అక్కడున్న ఎస్సీ, ఎస్టీ, బీసీకులాల వారు 1989 నుంచి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. రైతులు కాస్తులో ఉన్నప్పటికీ రికార్డుల్లో నమోదు చేయాలని, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కప్పపహాడ్‌లో భూ సమస్యను పరిష్కరించాలని, లేదంటే కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. పగడాల యాదయ్య మాట్లాడుతూ.. విలువైన భూములను కాజేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, డి.జగదీష్, బి.సామేలు, రాంచందర్, జగన్, సీహెచ్ జంగయ్య, బుగ్గరాములు, జగన్, ఎల్లేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సీలింగ్ భూమిలో విత్తనాలు నాటుతున్న సీపీఎం నేతలు



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న జిల్లా అధికారులు

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం రూరల్: వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా దృష్టి సారించాలని జిల్లా ప్రత్యేకాధికారి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆదేశించారు. సెర్ప్ సీఈఓ కార్యాలయం నుంచి మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా, ఎరువుల నిల్వలు, సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న వంతెనలు, ఫుల్ ట్యాంక్ లెవల్ ఉన్న చెరువులను తనిఖీ చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రెవెన్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఆయా శాఖల టీంలు సన్నద్ధంగా ఉండలని సూచించారు. గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి కూల్చివేయాలన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీఈఓ సుశీందర్‌రావు, పౌరసరఫరాల శాఖ అధికారి పారిజాత తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు ఇబ్బంది లేదు

జిల్లా వ్యవసాయాధికారి ఉష

ఇబ్రహీంపట్నం: ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉష సూచించారు. మండలంలోని దండుమైలారం, ముకునూర్, పోల్కంపల్లి, ఉప్పరిగూడలోని రైతుల పొలాలు, ఎరువుల గోదాములను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ సొసైటీల్లో 87 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా మరో రెండు రోజుల్లో 100 టన్నులు రానున్నట్లు వెల్లడించారు. వర్షాలు కురుస్తున్నందున దఫాల వారీగా యూరియా వాడితే భూగర్భ జలాల్లో కలుస్తుందని తద్వార తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఏఈఓ సృజన, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న ఉష

పశుపోషణలో జాగ్రత్తలు ముఖ్యం

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌రావు

యాచారం: రైతులు పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మొగుళ్లవంపు, గాండ్లగూడెం గ్రామాల్లో మంగళవారం నీటి నాలుక వ్యాధికి సంబంధించి గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాల ఉత్పత్తి సాధ్యమవుతుందని అన్నారు. వర్షాలు కురిసే సమయం, ఎండల తీవ్రతలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రేఖ, సిబ్బంది వీరారెడ్డి, శివాని, వెంకటయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మంచాల: రైతుల అభివృద్ధిలో పాడిపరిశ్రమ చాలా ముఖ్యమైందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్, జాపాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన బ్లూటంగ్ వ్యాక్సినేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అజాగ్రత్త కారణంగానే చాలామంది పాడి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల్లో ఉచితంగా అందించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాచారం: రికార్డులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

నటి కల్పిక హంగామా

- బ్రౌన్‌టౌన్ రిసార్ట్స్‌లో హల్‌చల్
- సిబ్బందిపై దుర్భాషలు
- ఎలాంటి ఫిర్యాదు అందలేదన్న పోలీసులు



రిసార్ట్స్ మేనేజర్ కృష్ణపై రూం కీస్ విసురుతున్న నటి కల్పిక



నటి కల్పిక

మొయినాబాద్: సినీ నటి కల్పిక హంగామా సృష్టించారు. రిసార్ట్స్ మేనేజర్‌పై మెనూ కార్డు, రూం కీస్ విసిరేసి దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడిలో ఉన్న బ్రౌన్‌టౌన్ రిసార్ట్స్‌లో చోటుచేసుకుంది. ఆమె సోమవారం సాయంత్రం క్యాబ్‌లో రిసార్ట్స్‌కు వచ్చింది. రూంలో దిగిన వెంటనే సిగరెట్లు కావాలంటూ సిబ్బందిని దుర్భాషలాడారు. రిసెప్షన్‌లో ఉన్న మేనేజర్ కృష్ణ వద్దకు వెళ్లి మెనూ కార్డు, రూం కీస్ మొహంపై విసిరేసి బూతు పురాణంతో రెచ్చిపోయారు. 40 నిమిషాలపాటు హల్‌చల్ చేశారు.

పోలీసుల నుంచి తప్పించుకోవడానికే..

ఇటీవల నగరంలోని ఓ పబ్‌లో గొడవ చేసిన ఆమెపై కేసు నమోదైంది. పోలీసులు ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి తప్పించుకోవడానికి ఇక్కడికి వచ్చినట్లు సమాచారం.

క్యాబ్, వైఫై ఫెసిలిటీ లేదు

బ్రౌన్‌టౌన్ రిసార్ట్స్‌లో జరిగిన హంగామాపై సినీనటి కల్పిక వివరణ ఇచ్చారు. రిసార్ట్స్‌లో జరిగిన విషయాలను వీడియో ద్వారా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వివిధ కేసుల్లో పోలీసులు తన వెంట పడుతున్నారని రిసార్ట్స్‌కు వెళ్లానని.. అక్కడ సిగరెట్ తేవాలని సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని వీడియోలో పేర్కొన్నారు. తన ఫోన్‌లో సిగ్నల్ లేదని క్యాబ్ బుక్‌చేయడానికి వైఫై ఫెసిలిటీ లేదని.. క్యాబ్ ఫెసిలిటీ లేదా అని అడిగానని.. అందుకే తిట్టాల్సి వచ్చిందని వెల్లడించారు. రిసార్ట్స్ సిబ్బంది తన పట్ల దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ సంబరాలు



నేదునూరు మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు

కందుకూరు: నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ- 2020 ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మోడల్ స్కూల్ పీఎంశ్రీ విభాగంలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో స్కూల్‌లో సంబరాలు నిర్వహించారు. ఢిల్లీలో నిర్వహించిన వేడుకలను స్క్రీన్ ద్వారా విద్యార్థులకు చూపించారు. అనంతరం ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడంలో మోడల్ స్కూళ్ల ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఉత్తమ ఫలితాను అందిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ ఏడీ శ్రీనివాసాచార్యులు, డీడీ దుర్గాప్రసాద్, జిల్లా ఏఎంఓ జయచంద్ర, ఎంఈఓ నర్సింహ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శివలీల, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు కుటుంబీకుల చెంతకు



బాలుడిని కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

పూడూరు: తప్పిపోయిన బాలుడిని చన్గోముల్ పోలీసులకు తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బాలుడు ప్రవీణ్(7) మంగళవారం చేవెళ్ల బస్ స్టేషన్‌లో తాండూరు డిపో బస్సు ఎక్కాడు. కండక్టర్ టికెట్ అడగడంతో బాలుడు డబ్బు లేదని చెప్పాడు. తండ్రి పేరు అడగ్గా ఎల్లప్పగా చెప్పాడు. దీంతో కండక్టర్ చన్గోముల్ ఠాణాలో అప్పగించాడు. పోలీసులు విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టడంతో మొయినాబాద్‌కు చెందిన ఎల్లప్ప దంపతులు పోలీసులను సంప్రదించారు. దీంతో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కుక్క కావాలా..



స్ట్రీట్ డాగ్స్ ఇక పెట్ డాగ్స్

- పార్కుల్లో కుక్క పిల్లల దత్తత కార్యక్రమాలు
- త్వరలో జీహెచ్‌ఎంసీ కార్యాచరణ
- వీధికుక్కల సమస్య పరిష్కారమే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: వీధి కుక్కల సమస్య పరిష్కారానికి బల్దియా చర్యలు చేపట్టనుంది. ఎంపిక చేసిన పెద్ద పార్కుల్లో వీధికుక్క పిల్లల ప్రదర్శన.. దత్తత కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. గతంలో 'మా ఇంటి నేస్తం' పేరిట నిర్వహించిన కార్యక్రమానికి మెరుగులు దిద్ది, కొత్త విధానంలో చేపట్టేందుకు రెడీ అవుతోంది. డా.బి.జనార్దన్‌రెడ్డి కమిషనర్‌గా ఉన్న సమయంలో 'మా ఇంటి నేస్తం' కింద కుక్క పిల్లలను పెంచుకోవాలని ముందుకొచ్చే వారికి వా టిని అందజేసేవారు. సదరు కార్యక్రమానికి మెరుగులు దిద్ది, వాటిని స్ట్రీట్ డాగ్స్‌లా చూడకుండా అందమైన పెట్‌డాగ్స్‌గా పెంచుకునేందుకు కుక్క పిల్లలకు వైద్య పరీక్షలు, టీకా తదితరాలు పూర్తయ్యాక పెంపకంపై అవగాహన వంటివి సైతం కల్పించి దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారికి అందజేయనున్నారు. ఎంపిక చేసిన పార్కుల్లో కెన్నెల్స్‌లో కుక్కపిల్లలను ఉంచి ప్రదర్శన ఏర్పాటు చేసి, అధికారులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి, నిబంధనలకనుగుణంగా నడచుకునేలా అవగాహన కల్పించి దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపే వారికి కుక్కపిల్లలను అందజేయనున్నారు.

కుక్కకాట్లు తగ్గేందుకు..

హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా దేశంలోని పలు నగరాల్లో వీధి కుక్కల సమస్యలున్నాయి. వాటి బారిన పడి ఎందరో.. ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. కోర్టులు సైతం ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తూ ఆయా మున్సిపల్ కార్పొరేషన్లను ప్రశ్నిస్తున్నాయి. ఎంతగా శస్త్రచికిత్సలు చేసినప్పటికీ, కుక్కల సంతతిని అరికట్టడం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో వీధికుక్కలుగా ఉంటే జనాన్ని కరుస్తుండటంతో వాటిని పెంపుడు జంతువులుగా మారిస్తే సమస్య తగ్గుతుందనే తలంపుతో జీహెచ్‌ఎంసీ ఈ కార్యక్రమానికి సిద్ధమైంది.

పార్కుల్లో ప్రదర్శనలు

- ఇందులో భాగంగా తొలుత బంజారాహిల్స్‌లోని జలగం వెంగళరావు పార్కులో, తర్వాత కేబీఆర్ పార్కులో కెన్నెల్స్‌లో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. తద్వారా డాగ్ లవర్స్ కుటుంబాలతో సహ వచ్చి ప్రదర్శనలోని కుక్కపిల్లల్లో నచ్చిన దానిని ఎంచుకునేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రదర్శనకు అవసరమైన కెన్నెల్స్ ప్రైవేట్ ఏజెన్సీ సహకారంతో సమకూర్చుకోనున్నారు. జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవల సిబ్బంది దత్తత ఇచ్చేందుకు కుక్కపిల్లలకు తగిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకరంగా ఉన్నవాటినే ప్రదర్శనలో ఉంచుతారు.
- తల్లిపాలు మరచిన, నులిపురుగులు వంటివి లేకుండా తగిన మందులతోపాటు అవసరమైన టీకాలు వేసిన రెండునెలల వయసు దాటిన కుక్కపిల్లలను ప్రదర్శనల్లో ఉంచుతారు. ప్రదర్శన సమయంలో కుక్కపిల్లల్ని దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చేవారికి అక్కడే దరఖాస్తులు అందజేస్తారు. ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ప్రజల సందేహాలకు సమాధానాలిస్తారు. ప్రజలు కుక్కకాట్ల బారిన పడకుండా ఉండేందుకు వీధికుక్కల సంఖ్యను తగ్గించే చర్యల్లో భాగంగా, ఎక్కువమంది ప్రజలు కుక్కల్ని దత్తత తీసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

కుక్కల ఆరోగ్యంపై వాకబు..

దత్తత తీసుకునేవారికి కుక్కల పెంపకంపై తగిన అవగాహనతో పాటు జంతు సంరక్షణకు సంబంధించిన అంశాల వంటివి వివరించనున్నారు. దత్తత ఇచ్చిన కుక్కలకు అవసరమైన వైద్య పరీక్షలకు జీహెచ్‌ఎంసీ సహకరించనుంది. నిర్ణీత వ్యవధిలో దత్తత తీసుకున్న ఇళ్లకు వెళ్లడం లేదా ఫోన్ ద్వారా సంప్రదించి దత్తత కుక్కల ఆరోగ్యాన్ని వాకబు చేయనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ప్రజారోగ్యం, జంతు సంరక్షణల దృష్ట్యా యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మళ్లీ ట్రెక్ పార్కులోకే వచ్చిన చిరుత

మణికొండ: మంచిరేవుల ట్రెక్ పార్కు నుంచి రాందేవ్‌గూడ మిలిటరీ ప్రాంతంలోకి వెళ్లిన చిరుత పులి ఒక రోజులోనే తిరిగి ట్రెక్ పార్కుకే చేరుకుంది. సోమవారం తెల్లవారుజామున రాందేవ్‌గూడలోని మిలిటరీ ప్రాంతంలో రహదారి దాటుతూ అక్కడి సీసీ కెమెరాలో కనిపించిన విషయం తెలిసిందే. అక్కడ దానికి అనువుగా ఉండకపోవటంతో అది తిరిగి సోమవారం అర్ధరాత్రి 12.25 గంటలకు ట్రెక్ పార్కుకు చేరుకుని ట్రాప్ కెమెరాలో చిక్కిందని అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ప్రశాంతమైన అటవీ ప్రాంతాన్నే చిరుత ఇష్టపడుతుందన్నారు. మిలిటరీ ప్రాంతంలో దానికి ఆహారం లభించకపోవటం, వాహనాల శబ్దాలు అధికంగా రావటంతోనే తిరిగి ట్రెక్ పార్కుకు వచ్చి ఉంటుందని చెప్పారు. ట్రెక్ పార్కులో దానికి ఇష్టమైన అడవిపందుల వంటి ఆహారం లభిస్తుండటం, ఎలాంటి అవాంతరాలు లేకపోవటంతో మరికొన్ని రోజులు ఇక్కడే ఉండే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దానికి సరైన ఆహారం లభించనప్పుడే బోన్‌లో ఎరగా పెట్టిన మేకను తినేందుకు వచ్చి చిక్కే అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు ట్రెక్ పార్కును మూసి ఉంచుతామని, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డులో ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలని లక్ష్మణ్ సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రభాకర్ (ఫైల్)

కుల్కచర్ల: కుటుంబ ఉన్నతికి గృహ నిర్మాణ రంగంలో పనిచేసేందుకు వెళ్లిన వ్యక్తి విగత జీవిగా మారాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన బోయిన ప్రభాకర్(35) గృహనిర్మాణ రంగంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఓ భవన నిర్మాణంలో పనిచేస్తుండగా విద్యుత్‌వైర్లు తగడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంతోష, కూతురు సహస్ర(7), కుమారుడు రిత్విక్(5) ఉన్నారు.

రిజ్వాన్‌కు గోల్డ్ మెడల్

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ వేదికగా జరుగుతున్న ఐదో టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. మూడో రోజు పోటీల్లో యువ సెయిలర్ మహ్మద్ రిజ్వాన్ సత్తా చాటాడు. ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ బాలుర విభాగంలో రిజ్వాన్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. రిజ్వాన్ ఈ కేటగిరీలో మరో రేస్ మిగిలుండగానే అగ్రస్థానం సాధించాడు. ఇదే కేటగిరీ బాలికల విభాగంలో తెలంగాణ సెయిలింగ్ అకాడమీకి చెందిన షేక్ రమీజ్ భాను, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన శ్రింగేరి రాయ్‌పై ఒక్క పాయింట్ ఆధిక్యంలో నిలిచి ఫైనల్ పోరుకు సిద్ధమైంది. ఐఎల్‌సీఏ 4 కేటగిరీ బాలుర విభాగంలో నేవీ యాచ్ సెయిలింగ్ క్లబ్ కు చెందిన రమాకాంత్ ఆరు పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఇదే కేటగిరీలో బాలికల విభాగంలో ఆస్థా పాండే అగ్రస్థానంలో నిలిచింది. 420 మిక్స్‌డ్ కేటగిరీలో తెలంగాణ సెయిలింగ్ అకాడమీకి చెందిన తనూజా కామేశ్వర్, శ్రవణ్ కత్రావత్ 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

పేరుకే పైలెట్ ప్రాజెక్ట్



కొందుర్గు రెవెన్యూ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి(ఫైల్)

పేరుకుపోయిన సమస్యలు

- భూ భారతిలోనూ ధరణి తప్పిదాలు
- ఇదేనా రోల్‌మోడల్ అంటూ రైతుల అసహనం

కొందుర్గు: ధరణి లోపాలను సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంతోనైనా తమ సమస్యలు తీరుతాయని ఆశించిన రైతుల కలలు కల్లలయ్యాయి. ఈ ఏడాది జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వస్తుందని చెప్పిన పాలకుల ప్రసంగాలు విని సంతోషించారు. ప్రభుత్వం జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్‌గ్రామంంగా ఎంపిక చేసింది. దీంతో మే 30న నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ప్రసంగిస్తూ మండలంలో భూ సమస్యలన్నింటికి పరిష్కారం చూపి రోల్‌మోడల్‌గా నిలపాలని అధికారులకు సూచించడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సదస్సులు పూర్తయి రెండు నెలలు గడిచినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు విన్నవించినా కదలని ఫైల్

భూభారతి అవగాహన సదస్సులో భాగంగా మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ నారాయణ రెడ్డికి పలువురు రైతులు తమ సమస్యలు వివరించారు.

- కొందుర్గు తూర్పు, పడమర రెండు రెవెన్యూ గ్రామాలుగా ఉండడంతో తమ భూములు నిషేధిత జాబితాల్లో చేరాయని గ్రామానికి చెందిన పెరుమాళ్ల శేఖర్ ఫిర్యాదు చేశారు.
- చెర్కుపల్లిలో 48 మంది భూములు అకారణంగా నిషేధిత జాబితాలో పడ్డాయని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి వాపోయారు.
- 1954 ఖాస్రా పహణీ రికార్డుల ప్రకారం చెర్కుపల్లికి చెందిన సర్వే నంబర్లు 119, 260, 271, 272, 274, 277, 280, 281, 282, 295లలో 79 ఎకరాల విస్తీర్ణం ఉన్న భూమి వేంకటేశ్వర స్వామి ఆలయం పేరిట పట్టా చేశారు.
- 1958లో భూములను రీ సర్వేచేయడంతో శివారులోని 1, 2, 4, 12, 67, 100, 107, 108, 146, 147, 148, 158, 159, 172, 318, 348, 252, 354, 357, 358, 359 లలో విస్తీర్ణం 79 ఎకరాల భూమిని వెంకటేశ్వరస్వామి పేరున పట్టా మార్చారు.

ఆగం చేసిన ధరిణి పోర్టల్

ధరణి పోర్టల్ ఏర్పాటు సమయంలో రీసర్వేకు ముందు, తర్వాత మొత్తంగా 158 ఎకరాలను ఆలయ భూమిగా చూపుతూ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో 48 మంది రైతులకు చెందిన భూములు నిషేధిత జాబితాలో చేరాయి. ఈ విషయమై బాధిత రైతులు తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం అవ్వలేదు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు పూర్తైన వెంటనే సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతాం. కొందుర్గును రాష్ట్రానికే దిక్సూచిగా మార్చుతాం అంటే సంతోషపడ్డారు. కానీ నేటికి సమస్యలు తీరలేదు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు

మొత్తం దరఖాస్తులు	573
ఆమోదం పొందిన దరఖాస్తులు	38
ఆర్డీఓ కార్యాలయంలో పెండింగ్	56
అడిషనల్ కలెక్టర్ వద్ద పెండింగ్	70
రిజెక్ట్ అయిన దరఖాస్తులు	120

సమస్య తీరేలా లేదు



తాతల కాలం నుంచి పట్టా భూములు సాగుచేసుకుని బతుకుతున్నాం. తమకు ఆపద వచ్చి ఓ గుంట భూమిని అమ్ముకుందామని వెళితే మీ భూములు దేవుడి పేరున ఉన్నాయి. అమ్మడానికి వీలుకాదని అధికారులు చెబుతున్నారు. భూ భారతి చట్టంతోనైనా మా సమస్య తీరుతుంది అనుకున్నాం. కాని ఏమి లాభం లేదు. మేము సచ్చినా సమస్య తీరేలా లేదు.
– వడ్డె చంద్రయ్య, రైతు, గంగన్నగూడ

త్వరలో పరిష్కారం



వీలైనంత త్వరలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. ఇప్పటికే దాదాపు సమస్యలకు పరిష్కారం చూపాం. వివిధ స్థాయిల్లో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే పరిష్కారం కావచ్చు.
– రమేశ్ కుమార్, తహసీల్దార్, కొందుర్గు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి



పార్టీ నాయకులతో లచ్చిరెడ్డి, రాజ్‌భూపాల్ గౌడ్

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నాయంటే అది కేంద్రంలోని బీజేపీ చలువే అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజలను చైతన్యం చేసి పార్టీని బలమైన శక్తిగా మార్చాలన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు.

ముఖ్య నేతలతో జిల్లా అధ్యక్షుడి భేటీ

అనంతరం ముఖ్య నాయకులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ సమావేశమయ్యారు. అన్ని గ్రామాల్లో పార్టీని స్థానిక ఎన్నికల్లో పోటీలో ఉంచాలని సూచించారు. గ్రామాల్లో పార్టీని బలమైన శక్తిగా సిద్ధం చేయాలన్నారు. అందుకోసం సమన్వయంతో నాయకత్వం పని చేయాలన్నారు. పార్టీతో పాటు అనుబంధ సంఘాలను సైతం క్రియాశీలకంగా పని చేయించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, మాజీ మండల అధ్యక్షుడు శ్రీశైలం, జంగయ్యగౌడ్, నాయకులు పాండు, జనార్దన్‌రెడ్డి, రాజు, రమేశ్, భిక్షపతి, వెంకటేష్, జగదీశ్వర్‌రెడ్డి, రాజుగౌడ్, పాండు, ఐలయ్య, పూర్ణచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో అంతస్తు నుంచి జారిపడి..

- వ్యక్తి దుర్మరణం
- మెటీరియల్ యంత్రాన్ని గమనిస్తుండగా ప్రమాదం



సంతోష్ మృతదేహం

శంకర్‌పల్లి: మనం ఒకటి తలిస్తే.. విధి మరొకటి తలచిందంటారు. అచ్చం అలాంటి సంఘటనే మంగళవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. తన ఒక్కగానొక్క అల్లుడిని మంచి స్థాయిలో చూద్దామని కలలుగన్న మామకు దుఃఖమే మిగిలింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిరుమలపూర్‌కి చెందిన రాజు భవన నిర్మాణ కాంట్రాక్టర్. ఆయనకి ఒక్కగానొక్క కుమార్తె సంగీత ఉంది. ఆమెని 2021లో చౌడపూర్ మండలం లింగంపల్లి తండాకి చెందిన నేనావత్ సంతోష్(33)కి ఇచ్చి వివాహం చేయగా.. వారికి రెండేళ్ల పాప ఉంది. మొదటి నుంచి సంతోష్ ఫార్మసీ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తక్కువ జీతానికి పని చేస్తున్నాడని, తనని మంచి స్థాయిలో నిలపెడుదామని సంతోష్ మామ నిర్ణయించుకున్నాడు. తన కన్‌స్ట్రక్షన్ విభాగంలోకి రెండు నెలల క్రితమే తీసుకొచ్చి సూపర్‌వైజర్‌గా చేశాడు. మంగళవారం సంతోష్ భవనం 5వ అంతస్తులో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి మెటీరియల్ తీసుకొచ్చే యంత్రాన్ని గమనిస్తూ కిందికి చూశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే పక్కనే ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అల్లుడిని ఉన్నత స్థాయిలో చూద్దామని ఆశపడిన మామకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు తదితర అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో ముగ్గురు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తమ సలహాల మేరకు పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఎర వేసి, నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.44 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ స్కామ్ సూత్రధారులు దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తించామని డీసీపీ దార కవిత మంగళవారం ప్రకటించారు. దుబాయ్‌లో కేంద్రంగా పని చేస్తున్న ముఠా వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ అంటూ ప్రచారం చేస్తోంది. దీనికోసం అవిస్టా స్టడీ గ్రూప్-డబ్ల్యూ పేరుతో ఓ సంస్థలు ఏర్పాటు చేసి, అనేక మందిని నకిలీ ట్రేడింగ్ అడ్వైజర్లుగా పెట్టుకుంది. వీళ్లు ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా పలువురికి ఎర వేసి, భారీ లాభాలు ఆశ చూపి, వీరి యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టించి, నిండా ముంచుతారు. నగర వాసి బదిలీ చేసిన మొత్తాలు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన మిలింద్ మనోహర్ నార్కర్, రానక్ జగదీష్ పటేల్, షేక్ ఇంతియాజ్ అహ్మద్ సిద్ధిఖీలకు పేర్లతో తెరిచిన బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయి. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం ఈ విషయాన్ని గుర్తించింది. ఈ ముగ్గురినీ పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారు. కమీషన్లకు ఆశపడి ఈ పని చేసినట్లు బయటపెట్టారు. మిలింద్ మనోహర్ ఇక్కడ వసూలైన సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌కి పంపడంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు.

డీమార్ట్ పేరుతో నకిలీ యాప్...

నిత్యావసర వస్తువులు ఖరీదు చేసే గృహిణులే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు డీమార్ట్ పేరుతో నకిలీ యాప్ రూపొందించారు. రూ.298 వెచ్చించి సరుకులు ఖరీదు చేయాలని భావించిన నల్లకుంట మహిళ రూ.1,17,521 నష్టపోయారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ స్టైప్ కౌంటర్ అనే యాప్‌లో గత నెల 1న డీమార్ట్ పేరుతో ఉన్న యాడ్ చూశారు. ఈ యాప్ ద్వారా ఖరీదు చేస్తే భారీ డిస్కౌంట్లు లభిస్తాయని ఉండటంతో ఆసక్తి చూపారు. ఆ ప్రకటనలో ఉన్న లింక్‌ను క్లిక్ చేయడంతో యాప్ బాధితురాలి ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయింది. దీన్ని ఓపెన్ చేసిన ఆమె అందులో కోరినట్లు ఇతర వివరాలతో పాటు బ్యాంకు ఖాతా అంశాలు జోడించింది. ఆపై రూ.298 వెచ్చించి కొన్ని నిత్యావసరాలు ఖరీదు చేసింది. అయితే ఈ వివరాలు తస్కరించిన సైబర్ నేరగాళ్లు వాటితో అనధికార లావాదేవీలు చేసి రూ.1,17,521 కాజేశారు. దీనిపై ఆమె బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయగా... కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆ మొత్తాన్ని బిల్లులో పేర్కొనమని అన్నారు. అయినప్పటికీ ఇటీవల వచ్చిన బిల్లులో ఆ మొత్తం చెల్లించాలని ఉండటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోపక్క ట్రేడింగ్ పేరుతో టోలిచౌకికి చెందిన వృద్ధుడి (80) నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19 లక్షలు కాజేశారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడికి రిమాండ్



దినేశ్

రాజేంద్రనగర్: రాజస్థాన్ నుంచి ఓపియం మాదక ద్రవ్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ యువకుడిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 755 గ్రాముల నల్ల మందు, ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన దినేశ్ (28) నగరానికి వలస వచ్చి అత్తాపూర్ పాండురంగానగర్ ప్రాంతంలో నివాసముంటూ చిన్నపాటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాజస్థానీలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో తరుచూ ఓపియం సేవిస్తుంటారు. నగరంలో ఈ డ్రగ్ దొరకకపోవడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రహించిన దినేశ్ రాజస్థాన్ నుంచి డ్రగ్ తీసుకొచ్చి ఇక్కడ రాజస్థానీలకు విక్రయించేవాడు. విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దినేశ్‌పై నిఘా పెట్టింది. సోమవారం రాత్రి పాండురంగానగర్‌లో ఓపియం విక్రయించేందుకు వెళ్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి 755 గ్రాముల ఓపియం, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.50 లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితున్ని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

అసైన్డ్ భూములు విక్రయిస్తే స్వాధీనం చేసుకుంటాం

మహేశ్వరం తహసీల్దార్ సైదులు



అసైన్డ్ భూమిలో బోర్డు పాతిన అధికారులు

తుక్కుగూడ: రియల్టర్లు ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నిస్తే సహించేది లేదని తహసీల్దార్ సైదులు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి మంఖాల్ రెవెన్యూలో గతంలో సర్వే నంబర్ 70,71, 72,73, 74 లో ఉన్న 23 ఎకరాల 21 గుంటల భూమిని పేదలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసింది. వర్టెక్స్ విల్లాస్ పక్కన ఉన్న ఈ అసైన్డ్ భూమిని ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించారు. దీంతో అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను మరింత పటిష్ట పర్చాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షురాలు పలుగుచెరువు మౌనిక నరేందర్, నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పుట్ట రమాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. బి-బ్లాక్ అధ్యక్షురాలిగా ఎన్నికైన అనంతరం మౌనిక ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్‌ను మరింత పటిష్ట పరచాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఆమె తెలిపారు.